# ఊరుతల్లి

మనం పేరుకు మనుషులమనుకుంటాంగానీ, ఒక్కొక్కసారి మనుషులు కూడా జంతువుల మాదిరే కనిపిస్తుంటారు. ఎదజేసిన ఎనుపోతులు ఎనుగొడ్ల మీద పడతాయి. గండుపిల్లులు మదమెక్కి ఆడ పిల్లుల్ని తరుముతాయి. మగకుక్కలు జొల్లు కార్చుకుంటూ ఆడకుక్కల్ని దేబిరిస్తాయి. ఈ మగవి ఇంత హైరానా చేస్తాయి కదా... ఆ ఆడదాన్లకు పిల్లలు పుడితే మాత్రం వాటి దిక్కు కూడా చూడవు. అయ్యో ఈ కూనలు తమవల్ల పుట్టినవే కదా! వీటి ఆలనా పాలనా చూసే భారాన్ని తాము కూడా కొంచెం మోసుకోవల్ల కదా! అనే బుద్ధిజ్ఞానం ఆ మగదాన్లకు ఉండదు. నారప్ప అట్లాంటి మగజాతికి చెందిన తండ్రి!

అది పిల్లిగానీ, కుక్కగానీ... ఆ ఆడదే తమ పిల్లలకు తిండిపెట్టి సాక్కుంటాయి. ఏదన్నా ఆపదొస్తే పిల్లల్ని ప్రాణాలకు తెగించి కాపాడుకుంటాయి. భూలక్ష్మి అట్లాంటి ఆడజాతికి చెందిన తల్లి. నలుగురు పిల్లోళ్లని కడుపులో పెట్టుకుని సాక్కున్న కన్నతల్లి!!

భూలక్ష్మి సంసారం బరువు మోసుకుంటుంటే, నారప్ప ఏం పట్టించుకోకుండా పుంజుకోడి మాదిరి తిరుగుతాండె. జల్సా జల్సా చేస్తాండె.

పీర్లసావిట్లో కూర్చుని పేకాడతాండె. ఆడోళ్ల వెంటబడి తిరుగుతాండె.

కల్లూ సారాయి తప్పతాగి దిబ్బల్లో పొర్లాడతాండె.

ఆ కల్లూ సారాయి యాలతాగేది? యాల పొర్లాడేది?? అని భూలక్ష్మి గొణిగేది. కాలికింద చెప్పులా పడి ఉండక నా సంగతి నీకు యాలనే...? అని నారప్ప ఎగిచ్చి ఎగిచ్చి భూలక్ష్మి డొక్కలో తన్నేది... ఇట్లే గడిచిపాయ చానా కాలం!

ఒకదినం ఊర్లో నారప్ప కనపడలే! డ్రామాలాడే బుడబుక్కల మల్లమ్మకూడా కనపడలే!

ఇద్దరూ లేచిపోయినారని ఖాయమైపాయ. 'నలుగురు పిల్లోళ్లని పుట్టించి నా ఎదాన పారేసి పోతివి కదరా బేవార్సోడా!' అని భూలక్ష్మి గుండెలు అవిసేటట్ల ఏడ్చె!

ఈ నాలుగు కడుపుల్ని నింపేది ఎట్లరా నేను? ఈ నలుగురు పిల్లోళ్లని బతికించుకుండేది ఎట్లరా నేను? అందరికీ సావు వస్తుంది. నాకెందుకు రాదు బగమంతుడా?' అని రేయి యెల్లా కుళ్ళి కుళ్ళి ఏడ్పు!

కానీ తెల్లారేటప్పటికల్లా... అమా ఆకలి! అమా బువ్వ! అని పిల్లోళ్లంతా కాకుల మాదిరి చుట్టుకుని అరుస్తుంటే భూలక్ష్మికి కంట్లో నీళ్ళు తుడచుకొనక తప్పలే!

భూలక్ష్మి పొద్దున్నే నసుకులో లేస్తాండె...

పాచి కసువులు నూక్కొని ఇంట్లోకి నీళ్ళు తెచ్చుకుంటాండె.

కిందటి సాయంత్రం ఏరుకొచ్చిన కట్టెపుల్లలు పెట్టి పొయ్యి వెలిగిస్తాండె.

సంగటి గెలుకుతాండె.

సంగట్లోకి ఊరుబిండి రవంత రవంత అద్దుకోండి అని పిల్లోళ్లకు గుర్తు చేస్తాండె.

ఇద్దరు మగ పిల్లోళ్లను బడికి తరుముతాండె.

కడగొట్టు పిల్లోన్ని చంకలో వేసుకుని కూలికి పోతాండె.

ఆడపాపను 'ఇల్లు చూపెట్టుకో' అంటాండె.

తడిక సరిగ్గా ఏసుకోమ్మా! ఇంట్లో కుక్కలు దూరేను! మీకు సైటాల ముద్ద లేకుండా పొయ్యేనూ! అని హెచ్చరిస్తాండె.

ఆ యమ్మ ఒకే ఒక ముద్దను తీసి పెట్టుకుంటాండె. దాన్నే పొద్దున ఇంత తిని, మధ్యాన్నానికి ఇంత తీసి పెట్టుకుంటాండె. తోటి కూలోల్లు తలకు రవంత పెడితే కడుపు నింపుకుంటాండె. లేనప్పుడు ఆ మిగతా కడుపు నిండా మంచినీళ్ళు తాగుతాండె.

కూలికి పోయొచ్చి ఇంట్లో గొంతు కూర్చునేది కాదు.

కాపోల్ల ఇండ్లల్లో ముండొడ్లు దంచుతాండె.

బియ్యం చెరిగి చెరిగి పోస్తాండె.

వాళ్ళు కొర్రన్నం గడ్డలు గడ్డలు పెడతాండిరి.

రాగి సంగటి ముద్దలు ముద్దలు పెడతాండిరి.

అవన్నీ కొంగు కింద మోసుకొస్తే

ఆ నలుగురు పిల్లోల్లు కరువులో పుట్టినట్లు

నాకు నాకు అని ఊడ్చి పారేస్తాండ్రి.

కోడి తన పిల్లలకు గింజలు గెదిరి గెదిరి పెట్టి, అవి ఈక వేసుకునేసరికి తనేమో తిండిలేక బెండుమాదిరి మారిపోతుంది చూడు... అట్లాంటి పిల్లల కోడి భూలక్ష్మి!

ఎంత దరిద్రంలో పుడితేనేమి? అట్లాంటి తల్లుల కడుపున పుట్టేదే ఒక భాగ్యం కదా! సంవత్సరం గడిచె. బుడబుక్కల మల్లమ్మ ఒక్కతే ఊరు చేరుకుండె. 'నా మొగున్ని ఏం చేస్తివే దొంగనా సవితీ!' అని భూలక్ష్మి దొమ్మలు బాదుకుంటూ మల్లమ్మ కొప్పు

పట్టుకుని ఈడ్చె.

'వాడెక్కడి మొగుడు తల్లీ? అడది కనిపిస్తే విడిచిపెట్టడు. ఏ ముండనో వెంటేసుకుని నన్నిట్లా విడిచిపెట్టి పోయినాడు తల్లీ' అని మొరపెట్టుకుండె బుడబుక్కల మల్లమ్మ!

'నా కర్మ! నా కర్మ! వాన్ని కాదు, వాన్ని పుట్టించిన ఆ బగమంతున్ని అనల్ల! అని నెత్తి బాదుకుండె భూలక్ష్మి.

ఆ ఊర్లో పెద్ద రైతులంతా భూలక్ష్మికి ధైర్యం చెప్పిరి. తొంభై ఎకరాల ఎర్రనేల ఉన్న రాంరెడ్డి, చెరువుకట్ట కింద నలభై ఎకరాలు మాగాణి ఉన్న చిన్న రాయుడూ, 'నీకేం ఫరవాలేదమ్మా! మేమంతా ఉన్నాం కదా' అని భరోసా ఇచ్చిరి. వాళ్ళ ఆడోల్లు కూడా అడిగితే లేదనకుండా భూలక్ష్మిని యాలా సమయానికి ఆదుకుంటాండిరి.

అట్ల మళ్ళీ మూడేండ్లు జరిగిపోయిన తరువాత హఠాత్తుగా ఒక దినం నారప్ప ఊడి పడె! అయినా ఆ తిరిగొచ్చిన మొగుడు భూలక్ష్మికి ఒరగబెట్టింది ఏమీ లేకపాయ. తన పాట తనదే అన్నట్లు బతికె! పెద్ద కొడుకు రెక్కల కష్టాన్ని తినె. పెండ్లాం రెక్కల కష్టం మీదనే పడిబతికె.

పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకల్తోగానీ పోదులే! నాకు మగతోడుంటే చాలులే! అని నిశ్చయానికి వచ్చె భూలక్ష్మికూడా!

పిల్లోల్లు పెరిగి పెద్దయిరి.

పెండ్లి చేసుకొని వారగల్లకూడా పాయిరి.

పెద్దకొడుకు పల్లెప్ప ఉండూరులోనే పెండ్లి చేసుకుని కూలీనాలికి పోతాండె. పిల్లనిచ్చిన మామ అంగడి పెట్టిస్తానంటే నడిమి కొడుకు పెండ్లాం ఊరు చేరిండె. చిన్న కొడుకు రామచంద్రప్ప మాత్రం చదువుకొని రివెన్యూ ఇనస్పెక్టరు ఉద్యోగం చేస్తాండె. ఒక్కగానొక్క ఆడకూతురు పెండ్లి చేసుకొని అత్తవారిల్లు చేరిండె.

ఆ సంసారంలో ఎవరు ఎన్నయినా అగచాట్లు పడి ఉండొచ్చుగాక! కానీ నారప్ప మాత్రం సచ్చే వరకూ నవాబు మాదిరే బతికె. కొంతమందికి ఏదో సుడి ఉంటుంది అంటారు, అట్లాంటి సుడి ఏదో నారప్పకు ఉండె. మంచంలో పడేనాటికి ఏ బంధువునుండో రెండెకరాల చేను కలిసొచ్చె.

"ఒరే! నన్ను ఎవరు బాగా చూసుకుంటారో వాళ్ళకు ఆ భూమి రాసిస్తాను" అని ముగ్గురు కొడుకుల్నీ ఊరించబట్టె.

'నాకు ఉద్యోగముందిచాలు ఆ భూమి మీద ఆశలేదు' అని పోటీనుండి తప్పుకుండె చిన్నకొడుకు. ఆశ ఉండాలే కాని, అతడు ఎంత భూమి, ఎంత ఆస్తి సంపాదించుకోకూడదు? అట్లే సంపాదించుకున్నాడు కూడా! అంతో ఇంతో సంపాదించుకున్నాడు కాబట్టే అన్నల మీద కనికరం పుట్టి ఆ రెండెకరాలూ వదిలేసుకున్నాడు.

భూమికోసం పెద్దోడూ, నడిపోడూ పోటీ పడిరి. ఒకరు గుడ్లకూర వండితే ఇంకొకరు కోడిని కోసిరి. ఒకరు సారా తిత్తులు తెస్తే ఇంకొకరు బ్రాందీ బుడ్డి తెచ్చిరి. ఒకరు ఎర్రదారం బీడీలు తెస్తే ఇంకొకరు సిగరెట్ల ప్యాకే తెచ్చిరి. రోగంతో మూలుక్కుంటూనే రాజవైభోగం అనుభవించబట్టె నారప్ప!

దినాలు గడిచె.

నారప్పకు తిన్న అన్నం కడుపులో నిల్వకపాయ.

లేస్తే కూర్చోలేకపాయ.

కూర్చుంటే లేవలేకపాయ.

అన్నీ మంచంలోనే జరిగిపోతాండె.

భూలక్ష్మి దగ్గరుండి మొగునికి సేవలు చేస్తాండె.

అబ్బా! ఆయాసం అంటే లేపి కూర్చోబెడతాండె.

అబ్బా! నడుంనొప్పి అంటే పక్క సర్దుతాండె.

కీళ్ళనొప్పులు అంటే కాళ్ళు పిసుకుతాండె.

వాంతి చేసుకోబోతే చెయ్యిచాస్తాండె.

నన్న పిల్లోని పక్కబట్టలు ఉతికినట్లు మొగుని బట్టలు ఉతుకుతాండె. అట్ల ఊడిగాలు చేసి చేసి భూలక్ష్మి కంపపుల్లమాదిరి అయిపాయె. 'అట్లాంటి మొగునికి ఇట్లాంటి పెళ్లాము!' అని ఎవరైనా మెచ్చుకుంటె నన్ను ఎన్ని బాధలైనా పెట్టి ఉండనీ! నా ధర్మం నాకు తప్పుతుందా? అంటాండె!

ఏం న్యాయమో! ఏం ధర్మమో అని వాళ్ళు నిట్టూరిస్తే 'నామొగునికి పూర్వజన్మలో ఏదో బాకీ చేసి ఉంటానులే! ఇప్పుడు తీర్చుకుంటున్నాను' అని నవ్వుతాండె.

ఒకదినం భూలక్ష్మితో "నేను చస్తే భూమి నీకేనే" అనె నారప్ప. "నాకెందుకు ముసలి ముండకి?" అనె భూలక్ష్మి.

"చేతిలో ఆస్తి ఉంటేనే సచ్చేటప్పుడు ఎవరన్నా చూసేది. ఉత్త తిక్కదానివి! ఎట్ల బతుకుతావో ఏమో" అని నిట్టూర్పు విడిచె.

"పోనీ... నువ్వు ఏ కొడుకు దగ్గర ఉంటావో చెప్పు. వాని పేరిట రాసేస్తాను" అనె.

"పెద్దకొడుకు దగ్గర ఉంటాను" అనె భూలక్ష్మి.

"సరె! అయితే పెద్దకొడుకు పేరిట రాస్తాను పో!" అనె నారప్ప.

ఒకదినం పెద్ద కొడుకును పిల్చి 'ఒరే! నేను సచ్చి పోయినంక మీ అమ్మను సరిగ్గా చూచుకోరా! అది మనల్ని అందరినీ కడుపు కట్టుకొని సాకిందిరా!' అని చెప్పెనంట.

సచ్చేముందు ఎవరో రైతు చూసే దానికి వచ్చి 'మా పాప భూలక్ష్మి నీకు బలే

చాకిరీ చేసింది వయ్' అని మెచ్చుకుంటే- "అది నా పెండ్లాం కాదు. మామా! నా తల్లి! నా తల్లి!!"అని వలవలా ఏడ్చెసనంట.

అట్ల ముగిసిపాయ చివరికి నారప్ప కథ!

పెద్దకొడుకు ఇంట్లో భూలక్ష్మికి కొన్ని దినాలు బాగానే జరిగె! పొద్దుకాగానే ముద్ద పెడతాండ్రి. అకూ వక్క పేడుకు దుడ్లు ఇస్తాండ్రి. ప్రతి శుక్రవారమూ నీళ్ళు కాచి పోస్తాండె కోడలు. మా అమ్మను సరిగా చూసుకో అంటాండె కొడుకు! కానీ-

రానూ రానూ ఊర్లో వానలు పాయ.

పంటలు పాయ.

కూలిదొరికేదే గగనమైపాయ.

సంసారం జరిగేదే కష్టమైపాయ.

పల్లెప్పకు అరుమంది పిల్లోల్లయిరి.

ఇంట్లో ఖర్చు పెరిగె.

గంపెడు సంసారమాయ.

ఏంచేసుకుతిందామన్నా కష్టమైపాయ.

ముద్ద తిందువురా అత్తా! అని కోడలు నెర్లుగా పిలిచేది తగ్గిపాయ.

"పాపా! మీ అవ్వ ముద్ద తింటుందేమో అడుగు" అని ముసిల్దానికి వినపడేటట్లు కూతుర్ని కూకేస్తాండె.

బువ్వ తినక గెడ్డి తింటానా? అని భూలక్ష్మి లోలోపల కుళ్ళి కుళ్ళి ఏడుస్తాండె!

కుప్పకూర ఎత్తుకొస్తే ముసిల్దాని తట్టలోకి రెండు తునకలు ఏసేదానికి కూడా ఆ కోడలికి బుద్ధి పుట్టకపోతాండె.

'నువ్వు మధ్యలో వచ్చిన దానివే! నేను నీ మొగున్ని పస్తులుండి కన్న దానినే!' అని కోడలితో కొట్లాటకు తీసుకుంటాండె భూలక్ష్మి.

అంతా నిద్రపోయినంక కొడుకూ కోడలూ రెండు గుడ్లు కొనుక్కొచ్చుకుని మాడ్చుకొని తింటాండిరి.

గోనెసంచి కప్పుకుని పండుకున్న ముసిల్దానికి గుడ్ల వాసన తగలగానే నోట్లో నీళ్ళూరుతాండె. కడుపులోంచీ దుఃఖం ఎగదన్నుకొస్తాండె. ఆ గోనెసంచిని అట్లే నిండా కప్పుకుని శబ్దం రాకుండా ఏడుస్తాండె. తన బాధను ఊర్లో వాళ్ళకు చెప్పుకుని గోడేడతాండె.

ఆ బాధకు తోడు భూలక్ష్మి నోట్లో ఒక పుండు పడిండె.

అది గబ్బు వాసన కొడతా చానా బాదిస్తాండె.

పొగాకూ కట్లపొడీ నమిలితే

నోరు తిమ్మిరెక్కి బాధ కొంచెం తగ్గినట్లుంటాండె.

కానీ పొగాకుకు దుడ్లు అడిగితే కొడుకు విసుక్కుంటాండె.

'నా ఇంటిమిందే పడి తినకపోతే కొన్నాళ్లు నీ చిన్నకొడుకు దగ్గరికి పోకూడదా? అని రంకెలేస్తాండె పల్లెప్ప!

'యాల పోతానూ? ఇది నా ఇల్లు' అంటాండె భూలక్ష్మి.

' ఈ ఇల్లు నీది కాదు. మా తాతది. నీకేం హక్కులేదు. పో పో... తిరిబేకి దానా!' అంటాండె కొడుకు.

'అయితే నా భూమి నాకు ఇడిసిపెట్టు. వేరే పోతాను' అంటాండె భూలక్ష్మి.

'ఆ భూమి నీదికాదు. మా నాయనది. పోపో... పక్కీరుదానా!' అంటాండె కొడుకు.

ఒకదినం చూసేదానికి వచ్చిన చిన్నకొడుకు రామచంద్రప్పకు అంతా చెప్పుకుని గొల్లుమని ఏడ్చె భూలక్ష్మి.

మనల్ని సాకి సంరక్షించి ఉండేది మన నాయన కాదు, మన తల్లి!' అని ఆ తమ్ముడు అన్నకు గుర్తు చేసె.

కాకులూ గద్దలూ కూడా తమకు పుట్టిన పిల్లల్ని సాక్కుంటాయి పో!' అని అన్న సమాధానమిచ్చె.

'తల్లికి కూడెయ్యకపోతే పురుగులు పడి నస్తావు' అని తమ్ముడు తిట్టె. 'నీకు అంత భయం ఉంటే, నువ్వే పిల్చుకుపోయి సాకు పో!' అని అన్న జవాబు చెప్పె.

'తల్లిని సాకుతానని చెప్పి ఆ రెండెకరాలూ రాయించుకుంటివి కదరా' అని అరిసె ఆ తమ్ముడు...

'నీకు ఉద్యోగమొచ్చిందీ, నాకు ఆ భూమి వచ్చింది సరిపోయింది పో పోరా!' అని అరిసె ఆ అన్న కూడా.

'ఈ పనికిమాలిన వానితో తగవెందుకుగానీ, పద మన ఇంటికి పోదాం' అని తల్లిని తన ఊరుకు బయల్దేరదీసె చిన్న కొడుకు రామచంద్రప్ప.

పెద్ద కొడుకును తిట్టి చిన్నకొడుకు వెంట బయల్దేరె భూలక్ష్మి. కానీ పోతూ పోతూ తన చేతుల మీద పెరిగిన మనుమలను విడిచి పెట్టలేక గుడ్లల్లో నీళ్ళు కక్కుకుండె. వక్కాకు చిత్తిలో కట్లపొడి గెదిరి ఆ పిల్లోల్లకు పదిపైసల రూకలు ఏరిచ్చె.

అన్నా! అక్కా! వదినా! అంటూ ఊర్లో సందు సందుకూ తిరిగె. మా చిన్నోని దగ్గరికి పోతుండాను. మళ్ళీ ఎప్పుడు చూస్తానో మిమ్మల్ని? అని కన్నీళ్ళు కొంగుతో తుడుచుకుంటూ బస్సెక్కె. 'అత్తగారింటికి పోతున్నట్లు ఏడుస్తావేమి?' అని నవ్వుతూనే కొంగు అడ్డం పెట్టుకుని ఏడ్చిరి ఆమెఈడు ముసిలమ్మలు

ఆ చిన్న కొడుకు ఆర్.ఐ కదా!

ఊరి బయట ప్లాటులో మూడు రూములు కట్టించుకోనుండె.

కిందన పాలరాతి గచ్చు పరిపించి ఉండె. భూలక్ష్మి ఇల్లంతా తిరుగుతూ...పాలు

పారబోసి పాలు ఎత్తుకోవచ్చు అంటాండె.

ఆ కొడుకు ఇంటికి ఎన్నెన్నో పండ్లు తెస్తాండె. రకరకాల తీపి వస్తువులు తెస్తాండె. అవన్నీ తినమని తల్లి గొంతుమీద కూర్చుంటాండె. ఆ కొడుకూ కోడలూ భూలక్ష్మిని బాగా చూసుకుంటాండిరి కానీ భూలక్ష్మికే మనసులో ఏదో గుబులు గుబులు అవుతాండె.

అక్కడ తన పల్లెలో మాదిరి కోడికూతలు వినిపించేవి కావు. పశువుల మందలు కన్పించేవి కావు. తనతోపాటు వక్కాకు వేసుకునేవాళ్ళు లేకపోయిరి.

తనను దుడ్లు అడిగే పిల్లోల్లు లేకపోయిరి. తనతో మాటలు పెట్టుకుండేవాళ్ళు లేకపోయిరి.

కడాకు కొట్లాట వేసుకునే దానికి కూడా ఎవరూ లేకపోయిరి.

ఈ ఊళ్ళో పొద్దే పోదు అని కాలుకాలిన పిల్లి మాదిరి తిరగబట్టె.

'ఇదేం కొంప. ఒక్కరూ వచ్చిపోయే వాళ్ళు లేరు' అని గొణుక్కోబట్టె.

'మన ఊరి తారురోడ్డుకు నేను కంకర మోసేటప్పుడు... అని చెప్పేదానికి పోతే, ఆఫీసుకు టైం అయింది మా అని వెళ్ళిపోతాండె కొడుకు.

ఒకసారి మీతాత కోడి నెత్తుకుపోతుంటే...' అని చెప్పేదానికి పోతే బడికి టైం అయిందని పారిపోతాండిరి మనుమల్లు.

'ఒకసారి నీ మొగునికి పరీక్ష ఫీజు కట్టేదానికి దుడ్లు లేకపోతే...'అని చెప్పేదానికి పోతే టీవీలో తలదూర్చి ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోతాండె కోడలు.

భూలక్ష్మికి ఏదో పోగొట్టుకున్నట్లుండె.

ఒడ్డున పడిన చేపపిల్ల మాదిరి గిలగిలా కొట్టుకుంటాండె.

ఊరు గుర్తొస్తాండె.

చంక దిగని చిన్న మనుమడు గుర్తొస్తాండె.

కొట్లాడే కొడుకు కోడలూ గుర్తొస్తాండిరి.

అరుగుల మీద చేరి సవాలు చేసే ఊర్లో వాళ్ళు గుర్తొస్తాండిరి.

తల్లి రెక్కల ఆయికి దూరమైన కోడిపిల్ల మాదిరి గజగజా ఒణికి పాయ భూలక్ష్మి!

ఆయమ్మకు జ్వరమొచ్చె.

నోట్లో పుండుబాధ ఎక్కువ అవుతాండె.

పొద్దుకు పదిసార్లు పొగాకు కట్లపొడి వేసుకుంటాండె.

తల్లిని డాక్టర్లకు చూపించె కొడుకు. అది కాన్సరు రోగం అని తేల్చిరి డాక్టర్లు.

బాగా ముదిరి పోయింది ఇంక ఎక్కువ కాలం బతకదు' అనిరి.

'ఆమె కోరుకున్నవన్నీ పెట్టండి' అని కూడా చెప్పిరి.

కానీ భూలక్ష్మమ్మ ఊరికి పోతానని కూర్చుండె.

'నువ్వింక ఎక్కువకాలం బతకవు' అని మాత్రం ఆ కొడుకు తల్లికి చెప్పలేదు.

'కోడికూర తింటావా మా? అని అడిగె.

భూలక్ష్మి ఉహూ అనె.

పొట్లికూర తెస్తునా? అని అడిగె.

భూలక్ష్మి ఉహూ అనె.

'నీకు ఏం కావాలో చెప్పుమా! నువ్వు మాత్రం ఇక్కడినుంచీ కదిలేదానికి లేదు' అని బంగపాయ.

ఉహూ అంటే ఉహూ అనె భూలక్ష్మి.

'నాకేమొద్దు. నన్ను మన ఊరికి చేర్చు సాలు' అనె.

తల్లి ఇంక ఎంతో కాలం బతకదని తెలిసి కొడుకులో నెర్లు పొంగు కొస్తాండె.

'మా అన్నయ్య ఒక్కడేనా నీ కొడుకు. మా అన్నయ్యకు పుట్టిన పిల్లోల్లేనా నీ మనుమల్లు? నేను మాత్రం నీ కొడుకును కానా? నాకు పుట్టిన పిల్లోల్లు నీకు మనుమలు కారా? తల్లికి ఇంత పక్షపాతం ఉండకూడదు మా! అని నిష్ఠూరమాడె.

భూలక్ష్మికి ముగ్గురు కొడుకులు ఉండొచ్చుగాక! వాళ్ళకు పుట్టిన సంతానమంతా మనుమలూ, మనుమరాళ్ళే కావచ్చుగాక! కానీ వాస్తవమేమంటే నడిమి కొడుకు వ్యాపారస్థుడైనాడు. చిన్న కొడుకు ఉద్యోగస్థుడైనాడు. కానీ పెద్ద కొడుకు మాత్రం ఇంకా సేద్యం పనులే చేస్తున్నాడు. ఒంటికి మట్టి పూసుకుంటూనే ఉన్నాడు. ఇంకా తన పల్లెను పట్టుకుని వేలాడుతూనే ఉన్నాడు.

కాబట్టి పెద్దకొడుకు పల్లెప్ప భూలక్ష్మికి తన ఒడిలోనే మసలుతున్నట్లు కనిపిస్తాడు. పల్లెప్ప... మేడిపట్టినా, పారపట్టినా, కొడవలి ఎత్తినా, బండి తోలినా...తన వృత్తినే అందిపుచ్చుకున్న ఆ కొడుకుని అపురూపంగా చూసుకుంటుంది భూలక్ష్మి. వేరే వృత్తుల్లోకి వెళ్ళిపోయిన మిగతా ఇద్దర్నీ అంత ఆత్మీయంగా చూసుకోలేదు. మనుమలు కూడా అంతే! ముచ్చటగా ముస్తాబై కాన్వెంటుకు పోయే చిన్న కొడుకు సంతానం కంటే చినిగిన అంగీల్తో పశువులు కాస్తూ ఏట్లో ఆడుకుంటూ కన్పించే పెద్దకొడుకు సంతానమంటే ఆమెకు ప్రేమ ఎక్కువ.

'నేను పోవల్ల అంటే పోవల్ల. ఆ ఊరు ఇడిసి పెట్టి నేను బతకలేను' అని మొండికేసుకుండె భూలక్ష్మి.

'మన ఊరు మన ఊరు అని కలవరిస్తావు. ఇది మాత్రం ఊరుకాక వల్లకాడా? ఏం దాచిపెట్టుకుండావు ఆ పల్లెకొంపలో' అని కొడుకు కోపమొచ్చి అరిసె.

భూలక్ష్మి చెప్పుకొచ్చె 'ఒరే సన్నోడా! మిమ్మల్ని సాకిందీ, పెద్ద చేసిందీ మీ తల్లే అనుకుంటున్నావు. కానీ కాదురా! నేను కాదు! మిమ్మల్నీ నన్ను కూడా తల్లి మాదిరి సాకి ఉండేది ఆ ఊరేరా!మీ నాయన నన్నూ నలుగురు పిల్లోల్లనీ ఇడిసిపెట్టి ఆ బుడబుక్కల

దానివెంట పోతే...నాలుగేండ్లు మనకు బువ్వ పెట్టి సాకిందేది ఎవరనుకున్నావు? ఆ ఊరిరైతులేరా?

ఓ అల్లుడా రాంరెడ్డీ! అని పిలిస్తే అయ్యో అత్తా! నీవా? రారా! అని పలికేవారు. ఏమే? మీ పిన్నమ్మ వచ్చింది చూడు. ఆ సంగటి ముద్దలు పెట్టి పంపియ్యి. మనం మళ్ళీ చేసుకుందాంలే! అనేవాడు.

చంద్రాయుడుమామా అని పిలిస్తే... రా రా పాపా! రా! నీ మొగుడు తిరిగొస్తాడులే! నువ్వేం ఎదారి పెట్టుకోవద్దమ్మా! మేమంతా ఉండాం కదా! ఇంట్లో రాగులుండాయి. తీసుకుపోయి పిల్లోల్లకి చేసిపెట్టు' అనేవాడు.

శుక్రవారం సంతనా పొద్దు మీ అన్నదమ్ముల్ని వంకలోకి పట్టకపోయి గడ్డిపాసల్తో తోమి, వీరయ్య శెట్టి అంగడి ముందు నిలబెడతాంటి.

'ఓ వీరయ్య అన్నా! నీ అల్లుళ్ళొచ్చినారు. వీళ్ళ తలకాయలకు రవంత సమురు పొయ్! అని అడిగితే 'అయ్యో! నా చెల్లెలు నోరు తెరిచి అడిగితే లేదంటానా? ఇదిగో? నా అల్లుళ్ళకు బాగా అంటియ్యి' అని నవ్వుతూ చారెడు సమురు పోసేవాడు.

అట్లాంటిది రా ఆ ఊరు. ఆ ఊరు సాకిందిరా మనల్ని. తల్లిరా! ఆ ఊరు మన తల్లి! ఆ పొద్దు తిని ఈ పొద్దు లేదనకూడదు. పుట్టిన ఊరును మరిచిపోయేదీ, పాలు తాగిన రొమ్మును గుద్దేదీ... రెండూ ఒకటేరా!'

మళ్ళీ గొంతు తగ్గించి అనె... 'మీనాయన నన్ను ఇడిసిపెట్టి పోయింది అలుసుగా తీసుకుని ఒక దినం ఆ శంకరప్ప నా మీద చెయ్యి వేసినాడు. అప్పుడేం జరిగిందనుకున్నావు? రామిరెడ్డీ, చంద్రాయుడూ అంతా వచ్చి ఆ శంకరప్పని కంబానికి కట్టేసి ఉతికినారు. ఆ ఊర్లో కాబట్టి ఆడదాన్ని అయినా ఒంటిగా బతికినానుకానీ, ఇట్లాంటి టౌనులో అయితే నలుగురు పిల్లోల్లతో బతికి బట్టకట్టేదానినేనా?' అని కన్నీళ్ళు కొంగుతో తుడుచుకుండె.

'నువ్వు చెప్పేదంతా ఒకప్పటి మాట మా! ఇప్పుడు పల్లెలు చానా మారిపోయినాయి. నువ్వింకా పాతకాలంలోనే ఉన్నావు' అనె చిన్నకొడుకు రామచంద్రప్ప.

ప్రస్తుతం పల్లెల్లో పరిస్థితులు చూస్తే ఆ మాట నిజమే అనిపిస్తుంది.

వానలొచ్చేకాలంలో చెనిక్కాయి పంటలో సంపాదించినదంతా మూటకట్టి తెచ్చి రామిరెడ్డి కొడుకు టౌనులో ఫ్యాక్టరీ పెట్టినాడు.

చెరువులు నిండే కాలంలో మాగాణి మీద సంపాదించినదంతా మూటకట్టి తెచ్చి చంద్రాయుని కొడుకు టౌనులో సినిమాహాలు కట్టినాడు.

రైతులు కొంచెం పచ్చగా ఉన్నప్పుడు, పల్లెల మీద వ్యాపారం చేసి సంపాదించిన సొమ్మంతా మూటకట్టి తెచ్చి వీరయ్య శెట్టి కొడుకు టౌనులో కార్పొరేషన్లు, ప్రైవేటు కాలేజీలు పెట్టినాడు.

భూములు అక్కడే పల్లెలో ఉంటాయి. కానీ భూములమీద వచ్చిన సంపద మాత్రం అక్కడుండదు. నూకలు దొరకని నేలని ఎన్నాళ్ళని నమ్ముకుంటాయి పక్షులు?

'ఇప్పుడు పల్లెలకంటే పట్నాల్లో బతికేదే మేలు. అక్కడ వుండే కరువులూ, కక్షలూ ఇక్కడ ఉండవు. మనల్ని పట్టించుకునే వాడే ఉండడు. ఇదే సుఖం. ఇంకనుంచీ ఇదే నీ ఇల్లు అనుకో! ఇదే నీ ఊరనుకో!' అని బైటికి వెళ్ళిపాయ ఆ ఆర్.ఐ. కొడుకు. ఏమనుకుందో ఏమో... భూలక్ష్మి ఏం మాట్లాడలేదు.

ఆ దినం తెల్లారె!

దూరంగా మసీదు మైకులో అజా వినిపిస్తాండె.

రేడియోల్లో వందేమాతరం వస్తాండె.

రోడ్లో పాల వ్యాను శబ్దం చేస్తూ పోతాండె.

పేపరు పిల్లోడు కిటికీలోంచీ పేపరు విసురుతాండె.

రామచంద్రప్ప లేచి చూస్తే...

పొద్దున్నే బొగ్గుతో పళ్ళుతోమే తల్లి కనపడలే!

ఇక్కడ భూలక్ష్మి కోసం ఇల్లంతా సోదిస్తుంటే... అక్కడ భూలక్ష్మి ఎక్కిన బస్సు కొట్టాలపల్లి దారిపడతాండె. కూడు పెట్టే కొడుకును కాదని, కాలితో తన్నే కొడుకు దగ్గరకే పోతాండె. బస్సు ముందు సీట్లో కూర్చుని భూలక్ష్మి దగ్గుతాండె. మూల్గుతాండె. నిండా దుప్పటికప్పుకుని అయాసపడతాండె. నోట్లో పుండు బాధ పీడిస్తాండె. అయినా ఊరు తల్లి దగ్గరవుతుంటే సంతోషం పట్టలేక పోతాండె. బస్సు ఊరు చేరగానే మెల్లగా దిగి అట్లే నిలబడిపాయ భూలక్ష్మి!

పండని చేనును వదిలేసి, ఉన్న ఇంటిని తెగనమ్మి, ట్రాక్టర్‌లో ఇంటి సామనంతా వేసుకుని పెండ్లాంపిల్లల్ని కూర్చోబెట్టుకుని ఎదురయినాడు పెద్ద కొడుకు పల్లెప్ప!

"ఎక్కడికి?" అని బిత్తరపోయి అడిగె భూలక్ష్మి.

"టౌనుకు!" అని ఏడ్పులేక నవ్వే పల్లెప్ప!

"రామిరెడ్డి ఫ్యాక్టరీకి, కాపలాదారుగా కుదురుకున్నాను" అనె.

భూలక్ష్మి అట్లే కిందికి కూలబడిపాయ.

పాపం! తననూ తన నలుగురు పిల్లోల్లనూ సాకిన ఆ ఊరిగడ్డకి ఎరువుగా మారడానికే వచ్చిందేమో ఆ ముసలి తల్లి!!

ఎంత సత్తెకాలపు మనిషి!!